పేరు మార్పు సమంజసం కాదు

తెలుగు విశ్వవిద్యాలయం పొట్టి శ్రీరాములు పేరు మార్పుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ విజ్ఞప్తి



పరిగి : కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు మెమోరాండం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులు

రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మహాసభ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్తా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, ఏ రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ మహనీయుడని వినతిపత్రంలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు బదులుగా సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టేందుకు రాష్ట్ర క్యాబినేట్ ఆమోద ముద్ర వేయడాన్ని యావత్ ఆర్యవైశ్యులతోపాటు తెలుగు భాషాభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

తెలుగు విశ్వ విద్యాలయం పేరు మార్చొద్దు

పరిగి : తెలుగు విశ్వ విద్యాలయానికి గల పొట్టి శ్రీరాములు పేరు మార్చవద్దని ఆర్యవైశ్య మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు మెమోరాండం అందజేశారు. తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును మార్చాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడాన్ని వారు ఖండించారు. కొత్త ప్రాజెక్టులు తీసుకు వచ్చి వాటికి ప్రస్తుతం నిర్ణయించిన వారి పేర్లు పెడితే బాగుంటుందని వారు సూచించారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగిస్తే ఆర్యవైశ్యుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- ప్రజావాణికి పలు శాఖల అధికారులు డుమ్మా
- హాజరుకానివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఆయా గ్రామాల ప్రజలు

పెద్దేముల్, సెప్టెంబర్ 23 : సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎమ్మార్వో కిషన్, ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్ సింగ్, ఏపీవో నర్సింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్ఎల్ఎం మోహన్‌సింగ్, ఏపీఎం ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ సమయానికి హాజరుకాగా.. ఏఈవో స్వాతి 12:35 నిముషాలకు హాజరయ్యారు. మండల వ్యవసాయ అధికారి, ఏపీఎం, స్థానిక వైద్య సిబ్బంది, పశువైద్య సిబ్బంది, అటవీశాఖ అధికారులు, ఆయా శాఖల ఏఈలు ఎవ్వరు కూడా ప్రజావాణికి అస్సలు హాజరుకావడంలేదు. ఈ విషయంలో ఎంపీడీవో జర్నప్పను వివరణ కోరగా.. సమయానికి హాజరుకావాలని ఫోన్ ద్వారా సమాచారం తోపాటు అందరికీ లెటర్లు కూడా పంపడం జరిగిందని, అయినా కూడా కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా అసలు ప్రజావాణికి హాజరుకావడం లేదన్నారు. హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవడానికి తనకు ఎలాంటి అధికారాలు లేవని, హాజరైన, హాజరుకాని అధికారుల వివరాలను కలెక్టర్‌కు పంపుతామన్నారు. హాజరైన అధికారులతో సోమవారం రెండు ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాజీ కుదుర్చుకునేందుకు లోక్‌అదాలత్

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 23 : కేసుల రాజీ కుదుర్చుకునేందుకు లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ ద్వారా తక్షణమే కేసులు పరిష్కారమవుతాయన్నారు. కక్షిదారులు ఎవరైనా తమ కేసుల రాజీ కోసం వేచిచూస్తే 28న లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. రాజీ కుదుర్చినట్లైతే ఇరువురు గెలిచినట్లేనన్నారు. పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నవారు రాజీ కావాలనుకుంటే తమ స్థానిక పోలీస్ స్టేషన్‌లను సంప్రదించాలని సూచించారు.

30న యువజనోత్సవాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30న సికింద్రాబాద్ బోట్స్ క్లబ్‌లోని యువజన సర్వీసుల శాఖ ప్రాంగణంలో యువజనోత్సవాలు, జిల్లా స్థాయి సైన్స్ మేళా నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా యువజన క్రీడా అధికారి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో భాగంగా నేపథ్య పోటీలు, ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, కవిత్వం, కథా రచన, పెయింటింగ్, ప్రకటన, హస్తకళ, వస్త్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15 నుంచి 29 ఏండ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను లక్డీకపూల్‌లోని స్నేహ సిల్వర్ జూబిలీ భవన్‌లో ఉన్న యువజన కార్యాలయంలో అందించాలని కోరారు. ఈ నెల 27లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సమాచారం కోసం 040-23205577ను సంప్రదించాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ అమలు చేయాలి

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్ ప్లాన్‌ను అమలు చేసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుల వివక్ష, అంటరానితనం నేటికీ కొనసాగుతున్నాయని, దళితులపై దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయన్నారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు, నాయకులు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఆందోళన

రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : గత ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను తమకు స్వాధీనపర్చాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట పలువురు లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మంఖాల్-2 వద్ద 2,016 మందికి గత ప్రభుత్వంలో ఇండ్లను మంజూరు చేశారని ఈ సందర్భంగా లబ్ధిదారులు తెలిపారు. స్థానికులకే ఇండ్లను కేటాయించాలని మంఖాల్‌వాసులు కొందరు కోర్టుకు వెళ్లారని, కేసును డిస్పోస్ చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇండ్లు మంజూరయ్యాక కూడా అద్దె ఇండ్లలో ఉండాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

లోక్‌అదాలత్‌లో సమస్యలను పరిష్కరిస్తున్న రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

రాజీయే రాజమార్గం

రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 23 : రాజీయే రాజమార్గమని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. సోమవారం చేవెళ్లలోని చేవెళ్ల కోర్టు అవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 128 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించగా.. రూ.3,41,000 ఫైన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

విదేశీ విద్యకు ఎక్స్‌పో దోహదం

ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కాలేజీ, వర్సిటీల ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 23 : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ప్రతిష్టాత్మకంగా 14 యూనివర్సిటీలతో పల్లవి స్టడీ అబ్రాడ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఎక్స్‌పో-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ రమేశ్ పతి, కాలేజీ డైరెక్టర్ రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు తదితరులు వర్సిటీల ప్రతినిధులతో కలిసి విద్యార్థులతో మాట్లాడారు. విదేశాల్లోని వర్సిటీల్లో విద్యనభ్యసించాలనే ఆశయమున్న విద్యార్థులకు ఈ ఎక్స్‌పో ఓ మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో అడల్ఫీ, అండర్సన్, రిజిస్, నార్త్ రన్, సెంట్రల్ మిచిగాన్, ఆరిజోనా, కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీల ప్రతినిధులు, కాలేజీ చైర్మన్ కొమురయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

ఉద్యోగుల సమస్యలపై అలసత్వం తగదు

పరిగి, సెప్టెంబర్ 23 : ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం అలసత్వం వహించడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు పేర్కొన్నారు. సోమవారం పరిగిలో జరిగిన యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు, పీఆర్‌సీలను సత్వరమే ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే రెండు డీఏలు, ఆరు నెలల్లో మెరుగైన పీఆర్‌సీ ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఈ అంశాలపై పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి పెరుగుతున్నదని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సర్దుబాటు జీవో 25 రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. నవంబర్‌లో జిల్లా మహాసభలు జరుపనున్నట్లు తెలిపారు. అనంతరం యూనియన్ సభ్యత్వ నమోదును వివిధ పాఠశాలల్లో చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ నిబంధనలు సరికావు

ఎస్‌టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్, సెప్టెంబర్ 23 : రేషనలైజేషన్ నిబంధనలు సరికావని, డీఎస్సీ ఉత్తర్వులు జారీ చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు సంవత్సరాల తరబడి కోరుతున్నా.. పిల్లల సంఖ్యాపరంగా ఉపాధ్యాయులను నియమించాలని ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరంగా పేర్కొన్నారు. 60 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడం, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో సంబంధం లేకుండా ప్రతి 20 మంది విద్యార్థులకు కనీసంగా ఇద్దరు ఉపాధ్యాయులు, తర్వాత ప్రతి 20కి ఒక్కరు చొప్పున ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. అన్ని ప్రాథమి పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి ప్రాథమిక పాఠశాలలను బలపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఐదు డీఏలలో సత్వరంగా రెండు డీఏలు ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకొని వెంటనే అమలుచేయాలని కోరారు. రిలీవ్ కాని టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. అవసరమైన అన్ని పాఠశాలల్లో ఖాళీలను సత్వరం విద్యావలంటీర్లతో భర్తీ చేయాలని, డీఎస్సీ నిమామకంతో పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు.

28న ఎంజే మార్కెట్‌లో గజల్ షాయరీ

సిటీబ్యూరో, సెప్టెంబరు 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వారసత్వాన్ని కాపాడుట, కళలను ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఎంజే మార్కెట్ ప్రాంగణంలో గజల్, షాయరీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖ గజల్, షాహిరి కళాకారులచే నిర్వహించనున్నందున ఆసక్తిగల వారంతా బుక్ మై షో లింక్ ద్వారా బుక్ చేసుకొని సీటును రిజర్వ్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ కోరింది. గ్రేటర్ హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడేందుకు జీహెచ్ఎంసీ విశేష కృషి చేస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ పేర్కొన్నారు. హైదరాబాద్ వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో ప్రజా సంబరాల కార్యక్రమాల ద్వారా చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కమిషనర్ చెప్పారు. పరిమిత సీట్లు ఉన్నందున ఆసక్తి గల వారందరూ బుక్ మై షో ద్వారా బుకింగ్ చేసుకోవాలని కమిషనర్ కోరారు.

సమతుల ఆహారాన్ని తీసుకోవాలి

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 23 : గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషకాల వారోత్సవాల కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతిరేఖ మాట్లాడుతూ.. పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని పేర్కొన్నారు. దీంతో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని, వారికి పోషహాకాహారాన్ని అందించడంతోపాటు విద్య బోధించడం జరుగుతుందని వివరించారు. అనంతరం కూరగాయలు, ఆకుకూరల ప్రాధాన్యతను వివరించి వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏంపీవో రఘు, సూపర్‌వైజర్ తిరుమల, వైద్యురాలు సైదమ్మ, హెచ్ఈవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శరత్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఉంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయం భయం..

- సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న పెద్దేముల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల
- శిథిలావస్థకు చేరిన తరగతి గదులు
- క్రిమికీటకాలకు ఆవాసాలుగా పాత భవన సముదాయం
- పూర్తిగా కూల్చివేయాలని కోరుతున్న గ్రామస్తులు, తల్లిదండ్రులు
- ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కొరతతో విద్యార్థులు సతమతం
- పట్టించుకోని అధికార యంత్రాంగం, నాయకులు

పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం

పెద్దేముల్, సెప్టెంబర్ 23 : శిథిలమైన గోడల మధ్య విద్యార్థుల చదువులు అనుక్షణం భయంభయంగా కొనసాగుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మరమ్మతులు చేయించి, మౌలిక వసతులు కల్పించినప్పటికీ ఇంకా కొన్ని పాఠశాలల్లో పరిస్థితులు మారకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం నూతన భవనం ఉన్నప్పటికీ కొన్ని తరగతులు మాత్రం ఇంకా పాత భవనంలోనే కొనసాగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం.

భవనం పూర్తిగా శిథిలం

పెద్దేముల్‌లో గ్రామ పెద్దలు, అప్పటి ప్రజాప్రతినిధులు 1970లో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. దాదాపు 12 గదులతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలను 6 నుంచి 10 తరగతులు వరకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అందులో 5 గదులను 2000లో గ్రామానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అప్పగించారు. మిగతా 7 గదుల్లో చాలా రోజులు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కొనసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నూతనంగా అదనపు గదులను నిర్మించి ప్రారంభించగా.. అక్కడ కొన్ని తరగతులను, పాఠశాల వెనుగభాగంలో అంతకుముందు నిర్మించిన భవనంలోకి కొన్ని తరగతులను తరలించారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులు ఈ శిథిలమైన గదిలోనే పాఠాలను వింటున్నారు. ఇటీవలే తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మరోమారు అదనపు గదుల నిర్మాణానికి నూతనంగా శంఖుస్థాపన కూడా చేశారు. పాత భవనంలో 7 గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యాన్ని కూడా శిథిలమైన ఓ గదిలోనే ప్రస్తుతం ఉంచారు.

పెద్దేముల్ : పైపెచ్చులు ఊడిపడుతూ ప్రమాదకరంగా ఓ గది

భవనాన్ని కూల్చివేయాలి

పాఠశాలలో 6 నుంచి 10 తరగతులకు 450 మంది విద్యార్థులుండగా.. పాఠశాల పాత భవనం పూర్తిగా శిథిలమైపోయింది. గోడల రాళ్లు పడిపోతున్నాయి. క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. కళాశాలకు ఇచ్చిన గదులు శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చి నూతన పాఠశాల అదనపు గదులను నిర్మించారు. మిగతా 7 గదులు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపి శిథిలమైన పాత పాఠశాల భవనాన్ని కూల్చివేయాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వేడుకుంటున్నారు.

హిందీ సబ్జెక్టుకు ఒకే ఒక్కడు..

450 మంది విద్యార్థులకుగాను 16 మంది ఉపాధ్యాయులతోపాటు ఓ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఉన్నారు. హిందీ సబ్జెక్టుకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థులు నష్టపోతున్నారు. అలాగే గణితానికి ముగ్గురు ఎస్ఏలకుగాను ఇద్దరు, ఒక రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను ఇతర పాఠశాలల నుంచి, తక్కువ విద్యార్థులున్న పాఠశాలల నుంచి కేటాయిస్తే విద్యార్థులకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్షణక్షణం భయపడుతున్నాం

పాత పాఠశాల భవనాన్ని కూల్చకుండా అలాగే వదిలేయడంతో క్రిమికీటకాదులు సంచరిస్తున్నాయి. శిథిలమై గోడల నుంచి అప్పుడప్పుడు పాములు బయటకు వస్తున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనే భయంతో క్షణక్షణం గడుపుతున్నాం. పాత భవనాన్ని కూల్చేస్తే పాముల బెడద తగ్గుతుంది.

- జాదవ్ భాను, 10వ తరగతి

రాళ్లు ఊడిపడుతున్నాయి

పాఠశాల ఆవరణలో ఉన్న గోడలు పూర్తిగా శిథిలం కావడంతో ప్రతిరోజూ ఆ గోడల నుంచి రాళ్లు ఒక్కొక్కటిగా ఊడిపడుతున్నాయి. రాళ్లు ఒక్కోసారి పెద్దశబ్దంతో కూలుతున్నాయి. అనుక్షణం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. మాలో ఉన్న భయం పోవాలంటే పాత గోడలను వెంటనే కూల్చివేయాలి.

- చిప్పె మంజునాథ్, 10వ తరగతి

పోస్టులను భర్తీ చేస్తే బాగుంటుంది

హిందీ, గణితంలో ఒక్కొక్క పోస్టుతోపాటు రికార్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పాఠశాలకు మంజూరు చేస్తే బాగుంటుంది. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అటువైపు వెళ్లాలంటేనే విద్యార్థులు జంకుతున్నారు. 8వ తరగతిని పాత భవనంలోనే కొనసాగిస్తున్నాం. పాత భవనాన్ని కూల్చివేయాలి. కొత్త తరగతి గదులను నిర్మించాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి న్యాయం చేయాలని వేడుకుంటున్నాను.

- సునీత, ప్రధానోపాధ్యాయురాలు

ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశాల నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 23 : ఓయూ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-ఈవినింగ్), ఎంబీఏ (పార్ట్ టైం-ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఇంచార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ పి.జలపతి తెలిపారు. పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తమ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని, నియమిత ఫీజు రశీదుతో సహా తమ కార్యాలయంలో అక్టోబర్ 19లోగా సమర్పించాలని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో అక్టోబర్ 24వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పరీక్షను అక్టోబర్ 27వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పై రెండు కోర్సులూ ఈవినింగ్ కోర్సులేనని చెప్పారు. టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఎంబీఏ కోర్సు కాల వ్యవధి రెండేండ్లు కాగా, పార్ట్‌టైం ఎంబీఏ కోర్సు కాలవ్యవధి మూడేండ్లని పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్-2024లో అర్హత సాధించినవారు ఈ పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, వారు దరఖాస్తు సమర్పించి, నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని వివరించారు. ఈ రెండు కోర్సులకూ డిగ్రీ పూర్తి చేసి రెండేండ్లు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉండడం తప్పనిసరి అని చెప్పారు. ఇతర వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్లలో చూసుకోవచ్చని సూచించారు.

ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్-2024 పరీక్ష ప్రశ్నాపత్రం ప్రాథమిక కీని ఇప్పటికే విడుదల చేశామని, దీనిపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ ఉపయోగించి, లాగిన్ అయి, అభ్యంతరాలు లేవనెత్తవచ్చని చెప్పారు. దానికి సంబంధించిన సాక్ష్యాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు ఈ అవకాశం అందుబాటులో